జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలకు భరోసా

- విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం జగన్
- వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజారోగ్యంపై సర్వే
- ఈనెల 30 నుంచి వచ్చే నెల 24 వరకు ఆరోగ్య శిబిరాలు


అన్నేవారిగూడెంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

భీమడోలు: పేదల ఆరోగ్యమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పేదలకు ఆరోగ్య భద్రత కల్పించాలన్న ఏకైక లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి ఇంటికీ వలంటీర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య సిబ్బంది సర్వే చేసి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించే కార్యక్రమం ఈ నెల 15వ తేదీ నుంచి అమలవుతోంది. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 24వ తేదీ వరకు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

శిబిరానికి వచ్చే వారికి కూపన్లు పంపిణీ

ఇంటింటికీ వెళ్లి సర్వే చేసిన వలంటీర్‌తో వైద్య ఆరోగ్య బృందాలు తమ గ్రామంలో నిర్వహించే ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన వారికి కూపన్లు ఇస్తారు. హాజరయ్యే గర్భిణులు, దీర్ఘకాలిక రోగులు, బాలింతలు, పిల్లలు, డయాబెటిస్, క్యాన్సర్, గుండె వ్యాధిగ్రస్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈనెల 30న మండలంలోని సూరప్పగూడెంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం కానుంది. ఆ గ్రామంలోని పీహెచ్‌సీల్లో ఇద్దరి వైద్యాధికారులు పాటు ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉంటారు. ఎండీ జనరల్, గైనిక్, పిల్లల వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు. 162 రకాల మందులు, 18 రకాల శస్త్ర చికిత్సలు, 14 ఎమర్జన్సీ కిట్లను అందుబాటులో ఉంచారు.

ఆసుపత్రి	కుటుంబాల సంఖ్య	సర్వే పూర్తి అయినవి
పూళ్ల పీహెచ్‌సీ	8,578	6,758
గుండుగొలను	15,013	8,291

సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న వారికి సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యం. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సాయం పొందుతున్న వారు సైతం ఈ శిబిరాలకు వస్తే వారికి అవసరమైతే స్పెషలిస్ట్ డాక్టర్లకు సిఫారసు చేస్తాం. అవసరమైన వారికి కార్పొరేట్, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్య మిత్రలు, వైద్య సిబ్బంది స్వీయ పర్యవేక్షణలో వారికి వైద్య సేవలందేలా తగు చర్యలు తీసకుంటాం. దీనితో వారికి వారి ఆరోగ్య పరిస్థితిపై అవగాహన కల్పించడంతో పాటు వైద్య సిబ్బందికి కూడా కేస్ హిస్టరీ తెలుస్తుంది. – బి.లీలాప్రసాద్, వైద్యాధికారి, పూళ్ల

ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్నాం



గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని సూరప్పగూడెంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ గ్రామంలోని 1,229 కుటుంబాల్లోని 3,324 మంది ఆరోగ్య పరీక్షలు చేసి వారి నివేదికలను సిద్ధం చేసాం. ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించి, వారికి ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్నాం. శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు సూచనల మేరకు వారికి నెట్‌వర్క్, కార్పొరేట్ ఆసుపత్రులకు పంపి ఆరోగ్యశ్రీ పథకంలో వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తాం.
– కె..శ్రీలక్ష్మి, వైద్యాధికారిణి, గుండుగొలను

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే వాసుబాబు శనివారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు తెలిపారు.ఉదయం 9 గంటలకు ఉంగుటూరు హైస్కూల్లో ఆర్టీసీ వారు ఇచ్చే ఉచిత బస్సుపాసులను విద్యార్థులకుఎమ్మెల్యే వాసుబాబు పంపిణీ చేస్తారని, 10 గంటలకు నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాలో పాల్గొంటారని మంగరావు తెలిపారు. 11 గంటలకు వెల్లమిల్లి లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వాసుబాబు పాల్గొంటారని వివరించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, అధికార్లు, ప్రజాప్రతనిధులు పాల్గొనాలని మంగరావు కోరారు.

నేడు చల్లచింతలపూడిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఏలూరు: చల్లచింతలపూడిలో శనివారం సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులకు ఉచిత బోర్లు పంపిణీ, జగనన్న శాశ్వత భూహక్కు పథకం ప్రారంభోత్సవం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం చేస్తారన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని నాని కోరారు.

క్లుప్తంగా

ఐక్యతను పెంచేందుకు పండుగలు దోహదం


పిప్పరలో గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుబాబు, ఎమ్మెల్సీ వెంకటరమణ, టీటీడీ సభ్యుడు సుబ్బరాజు

గణపవరం: గ్రామాల్లో ప్రజల మధ్య ఐక్యతను, ప్రేమాభిమానాలను పెంచడానికి పండుగలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పరలో వడ్డీల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయన ఎమ్మెల్సీ జయమంగళం వెంకటరమణ, తితిదే సభ్యుడు గాదిరాజు సుబ్బరాజుతో కలిసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామివారిని గ్రామంలో అట్టహాసంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు కాకర శ్యాంసన్, వడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత


ధ్యాన మందిరానికి కుర్చీలను బహూకరిస్తున్న రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ మద్దుల సాంబశివరావు

భీమడోలు: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని భీమవరం మాస్టర్ శ్రీనివాసరావు అన్నారు. పూళ్లలోని భవానమ్మ గుడి ప్రాంగణంలో శుక్రవారం పౌర్ణమి ధ్యాన బోధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్యానం అనుసరించే తరుణంలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. మాస్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ప్రశాంతతో, ఆనందంగా గడపాలంటే ధ్యానం ప్రక్రియను అనుసరించాలన్నారు. శ్వాసపై పట్టు సాధిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. అనంతరం రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ మద్దుల సాంబశివరావు, స్వరాజ్యలక్ష్మీ దంపతులు ధ్యానం వచ్చే వారి కోసం 50 కుర్చీలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల మాజీ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, నిర్వాహకులు .జి.అప్పన్న, పెద్దలు పచ్చా రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నారాయణపురంలో సొసైటీ సమావేశం

ఉంగుటూరు: చేబ్రోలు విశాల సహకార సంఘం జనరల్ బాడీ సమావేశం శనివారం మధ్యాహ్నం 4గంటలకు నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ యెలిశెట్టి పాపారావు బాబ్జి వెల్లడించారు. సమావేశంలో అధీకృత షేరు ధనం రూ.4 కోట్ల నుంచి రూ.6కోట్లకు పెంపుదల చేస్తూ 5(1) బైలా నంబరు సవరణ , ఏప్రిల్ 23 నుంచి కొత్త మెంబర్లను చేరికను ఆమోదించడం, జమా ఖర్చుల ఆమోదం తదితర అంశాలపై చర్చిస్తామని బాబ్జి వివరించారు. ఆడిట్ రిపోర్టును పరిశీలన, రైతుల సమస్యలపై చర్చిస్తామని శుక్రవారం బాబ్జి వివరించారు.

చేతి వృత్తుల కార్మికులకు విశ్వకర్మ యోజన

ఉంగుటూరు: పేద ప్రజలకు విశ్వకర్మ యోజన పథకం చాలామంచి పథకమని చేతివృత్తులవారికి బాగా ఉపయోగపడుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం బాదంపూడి, వెల్లమిల్లి, నీలాద్రిపురం, నాచుగుంట, యర్రమళ్ల, గుళ్లపాడులో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, సీనియర్ నాయకులు ఐ అశోక చక్రవర్తి వర్మ, సోషల్‌మీడియా కోఆర్డినేటర్ నూకల రోహిత్ నాయుడు, ఎస్సీ సెల్ నాయకుడు చమటపల్లి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యుడు కొరిపల్లి అప్పారావు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

పెదవేగి : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ విషయంలో ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని పెదపాడు ప్రాజెక్ట్ అదనపు సీడీపీవో ఎంఎస్.రాజశేఖర్ అన్నారు. పెదవేగి అంగన్‌వాడీ సెక్టారు సమావేశం పెదవేగిలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్. పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : రెండు రోజుల నుంచి తన భార్య కనబడుట లేదని ఓ భర్త శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం విజయరాయికి చెందిన జెట్టి కోటేశ్వరరావు భార్య భూలక్ష్మి ఈనెల 27న 10 గంటల నుంచి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఆయన ఇంటికి వచ్చాడు. భూలక్ష్మీ ఇంట్లో లేకపోవడతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద తెలికినా ప్రయోజనం లేకపోవడంతో కోటేశ్వరరావు పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ లబ్ధి


క్యాంపు కార్యాలయంలో వాహనమిత్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని ఇంతకు ముందు ఏ ప్రభుత్వంలో ఈస్థాయిలో ఆటోవాలాలను ఆదుకున్న దాఖలాల్లేవని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ వాహనమిత్ర కార్యక్రమంలో భాగంగా ఐదో ఏడాది ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు, ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్‌కు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నామని తెలిపారు. క్రమం తప్పకుండా అధికారం చేపట్టిన నాటి నుంచి వరుసగా ఐదో ఏట ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉండి పథకం వర్తించని వారికి రెండో దశలో ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్నారు. ఆటో డ్రైవర్లకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అర్హులైనవారికి ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేశామన్నారు. పిల్లల చదువుకు అమ్మ ఒడి పథకం, వృద్ధులు పింఛను అందజేస్తున్నామని, ఒక కుటుంబానికి ఇన్ని రకాల సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల అవస్థలను గమనించిన వైఎస్ జగన్ పాదయాత్రలో డ్రైవర్లకు రూ.10వేల ఆర్థిక సహాయన్ని ఏటా అందిస్తానని ప్రకటించి, ఆచరణలో చేసి చూపించి అండగా నిలిచారని అన్నారు. ఎమ్మెల్సీ జయమంగళం వెంకటరమణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ కులాలకు రాజకీయంగా గుర్తింపు, సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా వచ్చిందన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల సంగ్రామంలో బడుగు బలహీన వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. మళ్లీ అధికారంలోకి రావడానికి తెలుగుదేశం, ప్రతిపక్షాలు, పచ్చమీడియా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపుఇచ్చారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలోని నాలుగుమండలాలకు చెందిన 1,100 మంది డ్రైవర్లకు రూ.10 వేల చొప్పున రూ.1.10 కోట్ల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నడింపల్లి సోమరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల శ్రీను, తెనాలి సునీల్, రొంగల శ్రీను, కొండేటి వెంకటరత్నం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొవ్వలి హైస్కూల్ విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఏలూరు: నిరంతర సాధన, ఏకాగ్రత, క్రమశిక్షణ, ప్రణాళికతో ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధ్యపడుతుందని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్ఎస్ఎల్‌వీజీ శర్మ, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జక్కుల సురేష్ కుమార్, డీ.శ్రీను అన్నారు. శుక్రవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో ఎంపికైన కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్ఎం, ఫిజికల్ డైరెక్టర్లు, ఫస్ట్ అసిస్టెంట్ ఏ.సుధారాణి అభినందించారు.

ఎంపికైన వారు

బాస్కెట్‌బాల్‌లో జీ.ఏసమ్మ, ఐ.దివ్య, ఏ.దుర్గా నాగశ్రీ, ఎం.ప్రవీణ్ కుమార్, ఈ.చార్లెస్ వెస్లి, యూనోష్, పీ.సత్యసాయి వంశీ, టేబుల్ టెన్నిస్ విభాగంలో యు.ప్రణయ్, కిరణ్, తనూశ్రీ, హాకీ విభాగంలో కే.రాములు, ఎ.సంగీత్, జీ.చంద్రకాంత్, ఐ. అజయ్‌కుమార్, ఆర్. పార్థసారథి, కే.బెస్లీ, వై.జెస్సికుమారి, డీ. జూలీ, అమూల్య ఎంపికయ్యారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గణపవరం విద్యార్థి


యశోదకృష్ణ

గణపవరం: గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎ.యశోదకృష్ణ ఉమ్మడి జిల్లా నుంచి అండర్-17 రన్నింగ్ పోటీ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీడీ పద్మావతి తెలిపారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యాడని తెలిపారు. 3,000 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమస్థానం, 1,500 మీటర్ల రన్నింగ్ పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. విద్యార్థిని హెచ్ఎం ఎంఎస్ఎస్ మూర్తి తదితరులు అభినందించారు.

సొసైటీ నికర లాభం రూ.80,30,806


మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్

పెదపాడు: పెదపాడు విశాల సహకార సంఘం 2022-23 సంవత్సరానికి నికర లాభం రూ.80,30,806 ఆర్జించినట్లు ఆ సంఘ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు సొసైటీలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సొసైటీ సంఘ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ మాట్లాడుతూ సంఘం సభ్యులకు 15శాతం డివిడెండ్ అందిస్తున్నట్లు చెప్పారు. డివిడెండ్ సొమ్మును రైతులకు అందించేందుకు మహాజన సభ ఆమోదించిందని తెలిపారు. ఇటీవల మరణించిన సంఘ సభ్యులకు సీజీఎఫ్ నిధుల నుంచి రూ.10వేల చొప్పున అందించినట్టు తెలిపారు. మరణించిన సంఘ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపి, సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో త్రీమెన్ కమిటీ సభ్యులు కొల్లేరు మురళీ, కాలి మరియమ్మ, సంఘ సీఈఓ డీవీ సుబ్బారావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు నేడు ఉద్యోగ మేళా

ఉంగుటూరు: విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగ మేళా కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్ తెలిపారు. ఉద్యోగ మేళాలో భాగంగా అన్వేషణలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు వారి విద్యార్హతల ధ్రువపత్రాలతోపాటు, రెండుసెట్ల జిరాక్సు కాపీలు రెండు ఫొటోతో 30వ తేదీ ఉదయం 9గంటలకు నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు హాజరు కావాలని ఆయన తెలిపారు. జిల్లాలోని ఇంటర్ డిగ్రీ, ఎస్ఎస్‌సీ, ఐటీఐ డిప్లమా, డిగ్రీ, బీటెక్ ఉత్తర్ణులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ 99516 92594 నంబరును సంప్రదించాలని కోరారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణం


భీమడోలులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ

భీమడోలు: గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల రోడ్డులో ఓ వీధిలో జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.5లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శుక్రవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గత ఎన్నికల్లో ఈ ప్రాంతాలను సందర్శించిన తరుణంలో ఏన్నో ఏళ్లుగా రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు విన్నవించారని అన్నారు. వారి విజ్ఞప్తి మేరకు నూతనంగా రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, ఎంపీటీసీ ఆల్తి గోపి, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ ఆల్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్‌కు సోలార్‌పవర్

ఏలూరు రూరల్ : ఏలూరు మార్కెట్‌యార్డ్‌కు త్వరలో సోలార్ పవర్ ఏర్పాటు చేయనున్నట్టు ఏఎంసీ ఛైర్మన్ నెరుసు చిరంజీవులు అన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన మార్కెట్‌యార్డ్ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు యార్డ్‌లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ నెడ్‌క్యాప్ సహకారం రూ.38 లక్షలతో సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

రైలు పట్టాల పక్కన మృతదేహం

ఏలూరు: సీతంపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే పట్టాలు పక్కన యువకుడి మృతదేహం ఉంది. మృతుడు 20-25 సంవత్సరాల వయస్సు, చామన ఛాయ, నల్ల జుట్టు, సిమెంటు రంగు చొక్కా, నీలం రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుని వివరాలు తెలిసినవారు 8074055378 నంబర్‌కు తెలియచేయాలని కోరారు.

గుండె ఆరోగ్యానికి జాగ్రత్తలు తీసుకోవాలి

ఏలూరు : ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యానికి జాగ్రత్తలు తీసుకోవాలని, రోజూ వ్యాయామం చేయాలని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గి శెట్టి నూకరాజు శుక్రవారం అన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సెప్టెంబర్ 29న హార్ట్ డే నిర్వహించి ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించిందన్నారు.

నేడు భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి : భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పెదవేగి మండలంలోని భోగాపురం సచివాలయం పరిధిలో నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జానంపేట బాబు కోరారు.

నేడు వెల్లమిల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం వెల్లమిల్లి-1 సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయబాబు తెలిపారు. ఈ శిబిరంలో కాగుపాడు పీహెచ్‌సీ డాక్టరు మానస వైద్య సేవలు అందజేస్తారని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

సీఎం జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం


వృద్ధురాలి సమస్య తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం భోగాపురంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భోగాపురం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎమ్మెల్యేకి బ్రహ్మరథం పట్టి అడుగడుగునా హారతులు పట్టి, తిలకాలు దిద్దారు. ముందుగా గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అక్క చెల్లెమ్మలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, కొప్పాక సొసైటీ చైర్‌పర్సన్ చళ్లగొళ్ళ భూస్వామి, సర్పంచ్ దిమ్మిటి నాగమల్లేశ్వరి, ఉపసర్పంచ్ అబ్బదాసు రూతమ్మ, గ్రామ నాయకులు నాయకులు దిమ్మిటి రమేష్, మరీదు బాలస్వామి, వేగుంట అచ్యుతరావు, నెక్కలపు జగన్‌మోహన్‌రావు, కొమ్మిరపు నారాయణ, అబ్బదాసు సుబ్బారావు, గొళ్ళ సత్యనారాయణ, రాజువరపు వెంకట్రావు, గొల్లపల్లి జోజి, అబ్బదాసు నవీన్, బాడిత శివబాబు, బత్తిన శ్రీనివాసరావు, వీర్ల శరత్, ఇతర ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.